
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 • కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
3
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025



జైలుశిక్షకు బదులుగా సమాజ సేవ

● ప్లకార్డులతో ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్‌లో నిలబడిన మందుబాబులు



న్యాయమూర్తి ఆదేశం మేరకు గద్వాల పట్టణంలో ప్లకార్డులు పట్టుకొని నిలబడిన వ్యక్తులు

4

రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

4

ఉదయాన్నే క్యూలో పడిగాపులు



ఖిల్లాఘణపురం రైతు వేదిక వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

4

సారొస్తారొస్తారా?

నేడు గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన

- బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానంటున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- పార్టీలో ఉంటే కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదన్న కేటీఆర్
- తాజా పరిణామాల నేపథ్యంలో గద్వాల సభకు వెళ్లే విషయంలో ఉత్కంఠ
- తిరిగి గులాబీ గూటికి మాజీ మునిసిపల్ చైర్మన్ కేశవ్, మాజీ కౌన్సిలర్లు



గద్వాల తేరు మైదానంలో సభ కోసం చేస్తున్న ఏర్పాట్లు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో నడిగడ్డ రాజకీయం విభిన్నం... పక్కనే ఉన్న రాయలసీమ ప్రభావం... గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని కులాల ఆధిపత్యం... సంప్రదాయ ఓటుబ్యాంకు... పార్టీలు కాకుండా వ్యక్తులు, కుటుంబాలను బట్టి ప్రజాతీర్పు ఇక్కడ ప్రత్యేకం... అప్పుడప్పుడే జరిగిన ఎన్నికల్లో ఓ తీర్పును ఇచ్చిన ప్రజలు ఆ వెంటనే జరిగే మరో ఎన్నికల్లో మరో తీర్పును ఇస్తారు... ఇలాంటి ప్రాంతంలో ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల కేసుపై హాట్‌హాట్‌గా చర్చ జరుగుతున్న వేళ తమ పార్టీ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ ఫిరాయించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపిస్తున్నారు.. లేదులేదు తాను బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని బండ్ల అసెంబ్లీ స్పీకర్‌కు బదులిచ్చారు. ఈ పరిస్థితుల్లో గద్వాలలో జరిగే కేటీఆర్ సభకు బండ్ల వస్తారా.. రారా.. ఇప్పుడు ఇదే ఉత్కంఠ...

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గడిచిన కొద్ది రోజులుగా హాట్‌టాపిక్‌గా మారిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ మారిన వ్యవహారం మరింత ఉత్కంఠగా మారింది. గద్వాల జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం పర్యటిస్తుండటంతో ఏం జరుగుతుందోనన్న చర్చ ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ తరఫున ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పోటీ చేసిన వారిలో ఇద్దరు మాత్రమే గెలుపొందగా అందులో గద్వాల ఎమ్మెల్యే ఒకరు. అయితే గెలిచిన తర్వాత ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కండువా కప్పుకున్నప్పటి నుంచి చర్చ ప్రారంభమైంది. తాను అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌ను కలి



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

శానని, కప్పుకున్నది కాంగ్రెస్ కండువా కాదని ఆయన చెబుతుండగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ మాత్రం బండ్లతో పాటు పది మంది తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరారని సుప్రీం కోర్టులో కేసు వేశారు. సుప్రీం కోర్టు కూడా ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో నోటీసులు జారీ చేయడం, దానికి ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వడం లాంటివి చకచకా జరిగిపోతున్నాయి. అయితే ఇప్పుడు చర్యల బంతి స్పీకర్ కోర్టులో ఉన్నది. న్యాయ

(మిగతా 4లో..)

నేడు బీఆర్‌ఎస్ బహిరంగ సభ

గద్వాల, ఆంధ్రజ్యోతి : గద్వాలలో నిర్వహించే గర్జన సభకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం సాయంత్రం రానున్నారు. సాయంత్రం 4 గంటలకు ఆయన పట్టణానికి చేరుకుంటారు. ధరూర్ మెట్టు నుంచి తేరుమైదానం సభ వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లను పూర్తి చేశారు. గద్వాల మునిసిపల్ మాజీ చైర్మన్ కేశవ్ బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసింది. ఆయనతో పాటు పట్టణంలో ఆయన అనుచరవర్గం మాజీ కౌన్సిలర్లు చేరుతున్నారు. ధరూర్, మల్దకల్ మాజీ జడ్పీటీసీలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు చేరనున్నారు. వారందరినీ ఇప్పటికే బీఆర్‌ఎస్ నాయకులు బాసు హనుమంతు నాయుడు, ఆంజనేయులు గౌడ్‌లు ఆహ్వానించారు.

చిట్టీల పేరుతో చీటింగ్

- నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ
- రూ. 15 కోట్లు స్వాహా చేసిన దంపతులు
- సిక్ లీవ్ పెట్టి మాయమైన భర్త, నాకేం తెలియదంటున్న భార్య
- సహోద్యోగులు, స్నేహితులు, బంధువులే బాధితులు

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడు, భార్య నాగర్‌కర్నూల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కాంట్రాక్టు ఏఎన్‌ఎంగా పని చేస్తోంది. దంపతులు ఇద్దరూ కలిసి చిట్టీలు, డిపాజిట్ల పేరుతో వందలాది మందితో డబ్బు వసూలు చేసి, తిరిగి ఇవ్వకుండా మోసం చేశారు. ఈ ఉదంతం నాగర్‌కర్నూల్ జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. అతడు నాగర్‌కర్నూల్ మండలంలోని గగ్గలపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అతడి భార్య నాగర్‌కర్నూల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో కాంట్రాక్టు ఏఎన్‌ఎంగా పని చేస్తోంది. ఇద్దరూ కలిసి చట్ట వ్యతిరేకంగా రూ. 5 లక్షలు, రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల దాకా కూడా చిట్టీలు నిర్వహించారు. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఇస్తానని చెప్పి డిపాజిట్లు కూడా సేకరించారు. డిపాజిట్లుగా సేకరించిన డబ్బుకు వందకు రూ. 2 రూపాయల చొప్పున వడ్డీ ఇస్తామని నమ్మించారు. దీంతో వారి సహోద్యోగులు స్నేహితులు, బంధువులు వారి వద్ద చిట్టీలు వేశారు. చాలా మంది డబ్బు డిపాజిట్ చేశారు. ఇలా ఆ దంపతులు దాదాపు రూ. 15 కోట్లు వసూలు చేశారు.

మెడికల్ లీవ్ పెట్టి పరార్

సహోద్యోగులు, స్నేహితుల నుంచి డబ్బు వసూలు చేసిన ఆ ఉపాధ్యాయుడు వారం రోజులుగా కనిపించడం లేదు. అనారోగ్యం కారణంగా తాను అందుబాటులో ఉండటం లేదని సదరు ఉపాధ్యాయుడు విద్యాశాఖకు మెడికల్ లీవ్ సమర్పించి మాయం అయ్యాడు. దీంతో వారి వద్ద చిట్టీలు కట్టిన వారు, డబ్బు డిపాజిట్ చేసిన వారు ఆందోళనకు గురవుతున్నారు.. ఆ దంపతులు అద్దెకు ఉంటున్న ఇంటికి ప్రస్తుతం తాళం వేసి ఉంది. బాధితులు ఆ ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అతడి భార్య మాత్రం అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నట్లు సమాచారం. అడిగిన వారికి తనకేమీ తెలియదని తెలియదని సమాధానమిస్తున్నట్లు తెలిసింది.

ఓ వైద్య ఉద్యోగికి పక్షవాతం

వారి వద్ద అధిక మొత్తం డబ్బు డిపాజిట్ చేసిన ఓ వైద్య ఉద్యోగి సొమ్ము తిరిగి రాదన్న బెంగతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడు కాంట్రాక్ట్ పద్ధతిన వైద్యాశాఖలో ఉద్యోగిగా చేరాడు. వివాహం తర్వాత చాలా కాలానికి అతడి భార్యకు కూడా ఉద్యోగం వచ్చింది. ఇద్దరు నెల నెలా కూడబెట్టుకున్న సొమ్మును సదరు దంపతుల వద్ద డిపాజిట్ చేశారు. తీరా వారు మోసం చేయడంతో అతడు మానసికంగా కుంగిపోవడంతో పక్షవాతం వచ్చింది. ప్రస్తుతం నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యం కోసం సహాయం చేయండంటూ అతను సామాజిక మాధ్యమాల ద్వారా చేస్తున్న విజ్ఞప్తి, అందరినీ కలిచివేస్తోంది.

సమ్మెలో కార్మికులు వంట పనిలో టీచర్లు



ఆశ్రమ పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న డైలీ వర్కర్లు



విద్యార్థులకు భోజనం తయారు చేస్తున్న ఉపాధ్యాయులు

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం వంట కార్మికులు సమ్మె చేపట్టారు. దీంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండే బాధ్యత ఉపాధ్యాయులపై పడింది. పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీ కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి కార్మికులు శుక్రవారం ఆందోళన బాట పట్టారు. అందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలంలోని సిద్ధాపూర్ ఆశ్రమ పాఠశాల కార్మికులు ఉదయం 9 గంటలకు అల్పాహారం వండారు. అనంతరం పాఠశాల ముందు సమ్మె చేపట్టారు. దీంతో ప్రిన్సిపాల్ మల్లయ్యతో పాటు ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనాన్ని సిద్ధం చేసి, విద్యార్థులకు వడ్డించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం

● నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మరింత వేగవంతం కావాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డు, ఈదమ్మ గుడి సమీపంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారుడు రవి శంకర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత 13వ వార్డులోని నల్లవెల్లి రోడ్డులో బొంద మల్లమ్మ చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటుకల అవసరం లేకుండా అల్యూమినియం, ఫ్రేమ్‌వర్క్, కాంక్రీట్ గోడలతో ఆరుగురు పనివారితో, 20 రోజుల్లోనే పక్కా ఇల్లు నిర్మించవచ్చని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణం పూర్తవుతుందన్నారు. షేర్‌వాల్ టెక్నాలజీతో నాగర్‌కర్నూల్ పట్టణంలో 10 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ సంగప్ప, నాగర్‌కర్నూల్ మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. అనంతరం సమీపంలోని ఎస్సీ కళాశాల విద్యార్థుల వసతి గృహాన్ని పరిశీలించి, వార్డెన్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన సౌకర్యాలను త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

బైక్‌పై నుంచి కింద పడి మహిళ మృతి



భార్య మృతదేహాన్ని ఒడిలో ఉంచుకొని విలపిస్తున్న భర్త బాలు

వంగూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందింది. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గేటు వద్ద శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలంలోని అక్కారం తండాకు చెందిన బాలు, భార్య కళ(35)తో కలిసి బైక్‌పై కల్వకుర్తి నుంచి అక్కారం గ్రామానికి వెళ్తున్నాడు. భర్త బైక్ నడుపుతుండగా, వెనుక కూర్చున్న భార్య కళ కొండారెడ్డిపల్లి గేటు వద్ద, ఆరె మైసమ్మ గుడి సమీపంలో ప్రమాదవశాత్తు కింద పడింది. తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే భార్య ప్రాణాలు కోల్పోవడంతో బాలు కన్నీరు మున్నీరుగా విలపించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ మహేశ్ గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అసాంక్రమిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

» ఎన్‌సీడీ స్టేట్ సీవీహెచ్‌వో డాక్టర్ అబ్దుల్ వాస్సే

వనపర్తి వైద్య విభాగం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అసాంక్రమిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం హృదయ సంబంధ ఆరోగ్య అధికారి (సీవీహెచ్‌వో) డాక్టర్ అబ్దుల్ వాస్సే అన్నారు. ఆయన శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్‌సీడీ క్లినిక్, మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్లను జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీడీ సేవలను గ్రామీణ ప్రజలకు చేరువ చేసే దిశగా కృషి చేద్దామన్నారు. జిల్లా ప్రజలకు సమయానుకూలంగా వ్యాధి నిరోధక, నిర్ధారణ చికిత్సలు చేయాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అమలు, స్క్రీనింగ్ ప్రక్రియ, డాటా నిర్వహణ, రోగుల ఫాలోఅప్ విధానాలను సమీక్షించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ కేంద్రంలో వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ రమేశ్, ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ కొండా శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

సీసీవై గ్యాంగ్‌పై సీరియస్

» 25 మంది సభ్యుల బైండోవర్ » దాడులకు పాల్పడితే చర్యలు తప్పవు » డీఎస్పీ మొగులయ్య హెచ్చరిక



సీసీయూత్ సభ్యులకు సీరియస్ వార్నింగ్ ఇస్తున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాలో సంచలనంగా మారిన సీసీ యూత్ (చంపు లేదా చావు) గ్యాంగ్ అరాచకాలపై పోలీసుశాఖ సీరియస్‌గా స్పందించింది. గ్యాంగుకు సంబంధించిన పలువురిని గతంలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించింది. తాజాగా శుక్రవారం మరికొందరిని అదుపులోకి తీసుకొని బైండోవర్ చేసింది. ఈ సందర్భంగా గద్వాల పట్టణ పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మొగులయ్య మాట్లాడారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీసీ యూత్ గ్యాంగ్‌లపై నిఘా ముమ్మరం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. వారితో పాటు సీసీ యూత్ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లుగా ఉన్న 25 మందిని గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకొని బైండోవర్ చేసినట్లు తెలిపారు. దాడులకు పాల్పడినట్లు తెలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని, చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్యాంగు అరాచకాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా ముగ్గురు ఎస్ఐలను కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఎస్పీ ఆదేశం మేరకు బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. వాటిని తొలగించేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో సీఐ టి.శ్రీను, పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్, రెండవ ఎస్ఐ సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు అందని యూనిఫాంలు

» జిల్లా కార్యాలయంలోనే ముఠిపిస్తున్న వస్త్రం
» వనపర్తి జిల్లాలో 589 అంగన్‌వాడీ కేంద్రాలు



సాధారణ దుస్తులతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారులు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీల్లో చదువుకుంటున్న చిన్నారులకు ఇప్పటివరకు యూనిఫాంలు అందలేదు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు, నాణ్యమైన విద్యాబోధన జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరణకు చర్యలు తీసుకుంది. వారి కోసం ఆటవస్తువులు, క్రీడా సామగ్రిని కూడా పంపిణీ చేసింది. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చినట్లుగానే అంగన్‌వాడీ చిన్నారులకు కూడా యూనిఫాంలు ఇవ్వాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా గత ఏడాది సెప్టెంబర్ నెలలో మొదటి విడతగా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసింది. మిగతా కేంద్రాలకు రెండో విడతలో పంపిణీ చేసింది. అలాగే ఈ ఏడాది సెప్టెంబర్‌లో చిన్నారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేయాల్సి ఉండింది. కానీ ఇప్పటివరకు ఆ దిశగా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. యూనిఫాం తయారీ కోసం ప్రభుత్వం పంపించిన వస్త్రాలు జిల్లా శిశు సంక్షేమ కార్యాలయంలోనే ఉండిపోయింది. ఎన్ని యూనిఫాంలకు సరిపోయే వస్త్రం వచ్చింది? కుట్టు బాధ్యతలను ఎవరికి ఇస్తారు? ఆ పని ఎప్పుడు పూర్తవుతుంది? చిన్నారులకు ఎప్పుడు పంపిణీ చేస్తారు? తదితర అంశాలపై జిల్లా అధికారులకే స్పష్టత లేకుండా పోయింది.

19,604 మంది చిన్నారులు

వనపర్తి జిల్లాలోని మూడు ప్రాజెక్టుల్లో మొత్తం 589 అంగన్‌వాడీ కేంద్రాలు న్నాయి. వాటిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 171 కేంద్రాలు న్నాయి. ఇతర ప్రాంతాల్లో 418 కేంద్రాలు కొనసాగుతున్నాయి.

ఆయా కేంద్రాలకు 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు చిన్నారులు 13049, 3 సంవత్సరాల నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 6,555 మంది, మొత్తం 19604 మంది చిన్నారులు వస్తున్నారు. వారందరికీ యూనిఫాంలు అందించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో వారందరూ సాధారణ దుస్తులతోనే కేంద్రాలకు హాజరవుతున్నారు.

యూనిఫాంల తయారీకి అవసరమైన వస్త్రం సిద్ధంగా ఉన్నా, కుట్టు పని ఇంకా ప్రారంభం కాలేదు. గత ఏడాది ఆ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించారు.

మూడు రకాల సైజుల్లో యూనిఫాంలను తయారు చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. అయితే చాలా మందికి అవి సరిపోకపోవడంతో, సూపర్‌వైజర్ల సహకారంతో ఒక కేంద్రం నుంచి మరో కేంద్రానికి తెప్పించి అందరికీ సర్దుబాటు చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఆ ఊసే లేకుండా పోయింది.

ఆదేశాలు రాలేదు



అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు అందించాల్సిన యూనిఫాం తయారీ కోసం అవసరమైన వస్త్రం ఇప్పటికే జిల్లాకు వచ్చింది. కానీ యూనిఫాంల కుట్టు పనికి సంబంధించి అధికారుల నుంచి మార్గదర్శకాలు రాలేదు. గత ఏడాది ఆ బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించారు. ఈ ఏడాది ఎవరికి అప్పగిస్తారో డీఆర్‌డీవో అధికారులకే తెలుసు. మార్గదర్శకాలు వస్తే తగిన చర్యలు తీసుకుంటాం.
- సుధారాణి, డీడబ్ల్యూవో

క్రైం కార్నర్ ■ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కృష్ణ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కర్ణాటక బస్సు కింద పడి వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని కృష్ణానది బస్సు వంతెనపై శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా దేవసూగూరు పరిధిలోని యదలపూర్ గ్రామానికి చెందిన జయరెడ్డి సుగురెడ్డి దేవసూగూరు వెళ్తుండగా, రాయచూర్ నుంచి యాదగిరి వెళ్తున్న బస్సును ఢీకొని కిందపడ్డాడు. రాయచూర్ వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనదారుడి రెండు కాళ్లపై వెళ్లడంతో స్పృహ కోల్పోయాడు. దీంతో స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకునే సరికి సదరు వ్యక్తిని అప్పటికే స్థానికులు రాయచూర్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురికి ఐదేళ్ల జైలు శిక్ష

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడిచేసిన కేసులో ముగ్గురికి న్యాయస్థానం శిక్ష విధించింది. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఎస్పీ జానకి ఒక ప్రకటనలో వివరించారు. నవాబ్‌పేట మండలం కాకర్లపహాడ్ గ్రామంలో పాతకక్షల కారణంగా పాశం కనకయ్య, గుట్ట నర్సింహులు, పాశం యాదయ్యలపై నిందితులు కత్తులు, ఇనుప రాడ్, ఖాళీ బీరు సీసాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనపై మే 19, 2020లో నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌లో నిందితులపై 57/2020, 307 రెడ్‌విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదైంది. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో అదనపు సహాయ సెషన్స్ న్యాయాధికారి రాధిక నిందితులు ధనం రాజు, ధనం నారాయణ, భానుతేజాలకు ఐదేళ్ల సాధారణ జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించారు. సమగ్ర దర్యాప్తు చేసి నిందితులకు శిక్షపడేలా చేసిన అప్పటి ఎస్ఐ శ్రీకాంత్, ప్రస్తుత ఎస్ఐ విక్రం, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భక్తియార్‌బాబ, ఏఎస్ఐ నాగిరెడ్డి, కానిస్టేబుల్ రాజుగౌడ్‌లను ఎస్పీ అభినందించారు.

బైక్ చోరీలతో వాహనదారుల బెంబేలు

మక్తల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో తరచూ బైక్ దొంగతనాలు వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రెండు రోజుల క్రితం పట్టణంలో ఆరు బైక్‌లు చోరీకి గురి కావడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలను ఇంటి ముందు ఆపి ఉంచాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఇద్దరు దొంగలు వచ్చి బైక్‌లను చోరీ చేస్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. పట్టణ సమీపంలో ఓ వాహనం ఆపి అక్కడి నుంచి వచ్చిన దొంగలు బైక్‌లను చోరీ చేసి వాహనంలో తీసుకువెళ్లి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణానికి చెందిన పి.వెంకట్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, నగేష్, కుర్వ సిద్దుతో పాటు మరో ఇద్దరికి చెందిన మొత్తం ఆరు ద్విచక్రవాహనాలు ఒకే రోజు రాత్రి చోరీకి గురయ్యాయి.

ఇసుక టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

మాగనూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా శుక్రవారం తెల్లవారు జామున ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ మాగనూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నల్లగట్టు మారెమ్మ టెంపుల్ జాతీయ రహదారిపై పట్టుకున్నారు. అనుమతుల గురించి విచారించగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యాదగిరి జిల్లా అల్లిపురం చెందిన డ్రైవర్ సిద్దన్న, ఓనర్ సలీం అహ్మద్, గుల్బర్గాకు చెందిన డ్రైవర్ చంద్రప్ప, ఓనర్ రాఘవేంద్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ అన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవాబ్‌పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రికార్డుల్లో ఉన్న తల్లి పేరును మార్చి తన పేరుపై రికార్డు, ఆన్‌లైన్లో మార్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రం తెలిపారు. నవాబ్‌పేట మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామానికి చెందిన లింగమ్మకు నలుగురు కుమారులు, ఆరుగురు కుమర్తెలు ఉండగా, పెద్ద కొడుకు వెంకటయ్య, లింగమ్మలకు గత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేసింది. ఈ ఇల్లు పెద్ద కుమారుడు తమ్ముళ్లకు తల్లికి తెలియకుండా వెంకటయ్య గ్రామ పంచాయితీ రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. ఇలా ఎందుకు చేశావని నిలదీయగా ఆమెపై దాడి చేయడంతో పాటు ఇంటి ముందు ఆగి ఉన్న కారు అద్దాలు ధ్వంసం చేశారని లింగమ్మ శుక్రవారం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● పొలం కంచె రాళ్ల ధ్వంసం

కొనుగోలు చేసిన భూమిలో పాతిన రాళ్లను తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నవాబ్‌పేట మండలంలోని లేకిరేవ్ గ్రామంలోని సర్వే నంబర్ 206లో తొమ్మిది ఎకరాల 14 గుంటల భూమిని హైదరాబాద్‌కు చెందిన గూడూర్ మనోహర్, తన బంధువుల పేరున వ్యక్తి గతంలో కొనుగోలు చేశారు. అయితే ఈ భూమికి హద్దు రాళ్లు పాతి తోటను సాగు చేశారు. ఈ నెల 11న రాజాపూర్ మండలం చొక్కంపేటకు చెందిన కృష్ణయ్య, శేఖర్, రాములు, శ్రీను అనే వ్యక్తులు కంచె కడీలను తొలగిస్తుండగా అక్కడ పని చేస్తున్న వెంకటయ్య అడుగగా అతనిపై దాడి చేసి బెదిరించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఇచ్చిన పిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగకు రెండేళ్ల జైలు శిక్ష

కల్వకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో విచారణకు వచ్చిన పోలీసులపై దాడి చేసిన దొంగకు న్యాయమూర్తి రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో కల్వకుర్తి మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన బాసమోని సైదులు 2019 లో దొంగతనానికి పాల్పడ్డాడు. జడ్చర్లలో కేసు నమోదు చేసిన పోలీసులు అతన్ని పట్టుకోవడానికి ఇద్దరు పోలీసులు కల్వకుర్తికి వచ్చారు. కల్వకుర్తిలోని ఇందిరానగర్ కాలనీలో ఓ వీధిలో ఉన్న అతన్ని పట్టుకునే ప్రయత్నం చేయగా బాషమోని సైదులు వారిపై దాడి చేశాడు. దీంతో విధులకు ఆటంకం కలిగిస్తూ దాడి చేసిన బాష మోని సైదులుపై అప్పుడు ఎస్ఐగా పని చేసిన నరసింహులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు విచారణ జరుగుతూ వచ్చింది. శుక్రవారం అసిస్టెంట్ సెషన్ కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీదేవి బాష మోని సైదులుకు 2సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసులో సాక్షులను సమర్థవంతంగా కోర్టులో ప్రవేశపెట్టి శిక్ష పడేలా చేసిన తనతోపాటు పీటీ గోపాల్, కోర్టు కానిస్టేబుల్ బాలులను జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అభినందించారని ఎస్ఐ పేర్కొన్నారు.

రిటైర్డు ఉపాధ్యాయుడి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డు ఉపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి(62) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ గోవర్ధన్ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న విష్ణువర్ధన్‌రెడ్డి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటిపై కప్పుపై ఉన్న బాత్రూంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై మృతుని తమ్ముడు హనుమంతురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. కాగా, ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతునికి భార్య దివ్యశ్రీ ఉపాధ్యాయురాలుగా పని చేస్తుంది. మృతుని కుమారుడు రోహిత్‌కుమార్‌రెడ్డి కల్వకుర్తి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు.

ఆసుపత్రిలో చికిత్స పొంది..

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రిలో చికిత్స పొంది.. సొంతూరు వెళ్లే క్రమంలో మృతుడై కన్పించిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం... తెలకపల్లికి భూషపాగ వెంకటయ్య(48) ఆసుపత్రికి గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి వచ్చాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని నాగనూల్ రోడ్డులో గల ఒక చికెన్ సెంటర్ ముందు పడుకుని శుక్రవారం ఎంతకూ లేవకపోయేసరికి చుట్టుపక్కల వారు లేపేందుకు ప్రయత్నించగా మృతి చెంది కన్పించాడు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు ఆధారంగా తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన భూషపాగ వెంకటయ్యగా గుర్తించారు. విషయాన్ని అతడి భార్య లక్ష్మికి తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

(3వ పేజీ తరువాయి)

సారొస్తారొస్తారా?

సలహాలు తీసుకొని తన విచక్షణ అధికారాలతో ఆయన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే బండ్ల సహా మిగతా ఏడుగురు ఎమ్మెల్యేలు తాము బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నామని అభివృద్ధి పనుల కోసం మాత్రమే సీఎంను కలిశామని, ఆ సమయంలో కప్పిన కండువా కాంగ్రెస్ పార్టీది కాదని వివరణ ఇచ్చారు. టెక్నికల్‌గా చూస్తే వారిని సదరు కారణాలతో ఈ కేసును తప్పిస్తారనే అభిప్రాయం ఉన్నది. స్పీకర్ ఏదైనా ఉల్టాఫట్టా చేస్తే మళ్లీ సుప్రీం కోర్టుకు వెళతామని కేటీఆర్ ప్రకటించారు. ఆ పది మంది ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశం కాగా ఎలాంటి సూచనలు చేశారనేది ఇప్పటి వరకు తెలియలేదు.

నేటి సభపై ఉత్కంఠ...

గతంలో బీఆర్ఎస్‌లోనే ఉండి ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన గద్వాల మునిసిపాలిటీ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ తన అనుచరులు, మాజీ కౌన్సిలర్లతో పాటు బీఆర్ఎస్‌లో తిరిగి చేరాలని నిర్ణయించుకున్నారు. చేరికల కోసం శనివారం నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నారు. ఓ వైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పార్టీ ఫిరాయింపులపై చర్చ జరుగుతుండగా కేటీఆర్ పర్యటన ఉండటంతో ఉత్కంఠగా మారింది. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇప్పటికే పలు సందర్భాల్లో తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెబుతుండగా కాంగ్రెస్ నేతలు తన ఫొటోలను అనుమతి లేకుండా ఫ్లెక్సీలలో వాడుకోవడంపై కేసు కూడా నమోదు చేయించారు. ఇటీవల స్పీకర్‌కు ఇచ్చిన వివరణలో కూడా తాను బీఆర్ఎస్ లోనే ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంలో జడ్చర్లకు వచ్చిన కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించగా కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోనే ఉంటే పార్టీ ఆఫీసుకు ఎందుకు రావడంలేదని బీఆర్ఎస్ శాసన సభా పక్షంలో ఎందుకు కూర్చోవడం లేదని, పార్టీ కార్యక్రమాలలో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే తీరుపై కొంత పరుషంగానే మాట్లాడారు. బండ్ల పార్టీలో ఉన్నానని చెబుతున్నారుగా అన్న ప్రశ్నకు తనది ఏ పార్టీ అని చెప్పుకోలేని దురవస్థలో ఉండి ఓట్లేసిన ప్రజలను, వేయించిన కార్యకర్తలను పిచ్చోళ్లను చేస్తున్నాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో సభ జరుగుతుండటం బీఆర్ఎస్‌లోనే ఉంటే మరి ఈ సభకు బండ్ల హాజరు అవుతారా, లేక గైర్హాజరు అవుతారా అనేది ప్రశ్నార్థకంగా ఉన్నది. సభకు హాజరైతే మిగతా శ్రేణుల స్పందన ఎలా ఉంటుంది అనే ఉత్కంఠ కూడా తీవ్రంగా ఉన్నది.



గులాబీ మయంగా మారిన గద్వాల రోడ్డు

నాయకత్వం కోసం పోటీ

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పోటీ చేయగా కాంగ్రెస్ పార్టీ తరఫున జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య పోటీ చేశారు. హోరాహోరీ పోరులో కృష్ణమోహన్‌రెడ్డి విజయం సాధించి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన తర్వాత నుంచి బీఆర్ఎస్‌లో నాయకత్వం కోసం పోటీ నెలకొన్నది. అందివచ్చిన అవకాశాన్ని తమకు వచ్చే ఎన్నికల్లో రాజకీయ వేదికగా మార్చుకోవడానికి బల్గెర హనుమంతునాయుడు, డాక్టర్ కురువ విజయ్‌కుమార్ తమ ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో హనుమంతు నాయుడు కురువ విజయ్‌కుమార్‌లు ఇప్పటికే పార్టీలో ఉండగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కృష్ణమోహన్‌రెడ్డి సీఎంను కలిసినప్పటి నుంచి పార్టీలో రుసరుసలు కనిపిస్తున్నాయి. గతంలో ఒకే పార్టీలో ఉన్న వీరు ఎన్నికల ముందు సరిత పార్టీ మారడంతో ఇబ్బంది కాలేదు. ఇప్పుడు బీఆర్ఎస్ నుంచే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశపడే వారి జాబితాలో మరో అభ్యర్థి కూడా చేరారు. మాజీ మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరుతుండగా తాను కూడా పోటీలో ఉండాలని భావిస్తున్నాడు. దీంతో ఆ పార్టీలో పోటీ పెరుగుతున్నది. ఒకవేళ బండ్ల పార్టీలో ఉండటానికి భవిష్యత్తులో సమ్మతించే పక్షంలో వీరందరికీ నిరాశ ఎదురయ్యే పరిస్థితి ఉన్నది.

ఇళ్ల కేటాయింపుపై విచారణ చేపట్టాలి

» ఆర్డీవో కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

కొల్లాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కొల్లాపూర్ నియోజకవర్గానికి సరైన రీతిలో న్యాయం జరగలేదని సీపీఐ కొల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగాయని, వాటిపై ప్రభుత్వం విచారణ జరిపించి, అర్హులైన పేదలందరికీ తక్షణమే ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఎన్టీఆర్ చౌరస్తా నుంచి స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించి అనంతరం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాల నరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ మాట్లాడారు. గడిచిన పది సంవత్సరాలుగా ప్రభుత్వాలు ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు ఇస్తారని, ఎన్నో ఆశలతో ఎదురు చూస్తుంటే తీరా ప్రభుత్వం పథకాన్ని ప్రవేశ పెట్టిన తరువాత కొల్లాపూర్ నియోజకవర్గంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల కేటాయింపు జరగడం అత్యంత బాధాకరమని విమర్శించారు.

సీపీఐ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఇందిర, కురుమయ్య, కిరణ్ కుమార్, బండి లక్ష్మీపతి, కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండీ యూసుఫ్, మండల నాయకులు జంగం శివుడు, చందు, శంకర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివ కృష్ణ, గుర్రం శేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకృష్ణ, గుర్రం శేఖర్, దాము, రమేష్, వెంకటస్వామి, జి.వెంకటస్వామి, శివ , ఎండీ రుక్నుద్దీన్, పవన్, సత్యం, గోవింద్ రెడ్డి, వెంకటమ్మ, చెన్నమ్మ, రాములమ్మ, ఎల్లమ్మ, పద్మ, లోకేశ్వరి, లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ , మల్లేశ్వరి వీరితో పాటు పేద మహిళలు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

జైలుశిక్షకు బదులుగా సమాజసేవ

» ప్లకార్డులతో ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్‌లో నిలబడిన మందుబాబులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సురక్షాస్మృతి(బీఎన్ఎస్ఎస్) చట్టం ఆధారంగా తొలితీర్పు వెలువడింది. దీంతో మద్యం మత్తులో పోలీసులకు దొరికిన ఇద్దరు వ్యక్తులకు జైలుశిక్షకు బదులుగా సమాజసేవ విధిస్తూ గురువారం జిల్లా న్యాయాధికారి ఉదయ్‌నాయక్ తీర్పు వెలువర్చిన విషయం తెలిసిందే. గద్వాల జిల్లా కే.టీ.దొడ్డి మండలం ఉమిత్యాల గ్రామానికి చెందిన ఈరన్న, కుచ్చి నెర్లకు చెందిన రాజులు మద్యం తాగుతుండగా కేటీదొడ్డి ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టారు. సమాజ సేవ చేయాలని తీర్పు వెల్లడించడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి జంక్షన్ వద్ద వారు మద్యం వద్దు.... ఫ్యామిలీ ముద్దు అని, మద్యం సేవించి వాహనాల ను నడపరాదని, మద్యం సేవించి వాహనాలను నడిపితే శిక్షార్హులు అని ప్లకార్డులతో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ బాలచంద్రుడు మాట్లాడుతూ.... బీఎన్ఎస్ఎస్-2023 చట్టంలోని 355వ సెక్షన్ కింద ఈ తీర్పు వెలువడిందని, 2024 జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన ఈ కొత్త చట్టం క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో అమలు అవుతుందన్నారు. నేడు గద్వాల జిల్లాలో దీన్ని మొదటిసారిగా అమలు చేసి న్యాయాధికారి తీర్పు ఇచ్చిందని తెలిపారు. ప్రమాదాలు జరుగడానికి కారణం మద్యం మత్తేనని, మత్తులో వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోవద్దన్నారు.

పొంగి పొర్లుతున్న చారకొండ కత్వ



చారకొండ కత్వ

చారకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రంలోని చారకొండ కత్వ పొంగి పొర్లుతుంది. చాలా కాలం తరువాత కత్వ పొంగి పొర్లింది. దీంతో చారకొండ ప్రజలు, యువకులు శుక్ర వారం కత్వ దగ్గరికి వెళ్లి కేరింతలు కొట్టుకుంటూ ఆనందంతో కేరింతలు కొట్టారు. అదేవిధంగా మండలంలోని బొమ్మలగుడిసెలు, కమాల్‌పూర్‌తండా వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

గద్వాల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. కృష్ణా పరివాహక ప్రాంతాలతో పాటు భీమా నదికి కొంతమేర వరద రావడంతో శుక్రవారం 1.32లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టులోని గేట్లను మూసివేసి కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,167 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215టీఎంసీలు కాగా, ప్రస్తుతం 206.53 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు మూసుకున్నాయి. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 15వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 21వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. గేట్లు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 10వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉంది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 60వేల క్యూసెక్కులు జూరాలకు వస్తుంది. ప్రస్తుతం జూరాలకు 1.15లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 12 గేట్లను ఎత్తి 85,700క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 41,283 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 23వేలు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అందులో 20వేల క్యూసెక్కులను శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

రికార్డు దిశగా జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లోని విద్యుత్ ఉత్పత్తి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి రికార్డు దిశగా పయనిస్తోందని ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా జూరాల ప్రాజెక్టుకు ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 12 యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 4.984 యూనిట్‌లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 316.491 మిలియన్ యూనిట్లు చేపట్టామని తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్‌లను ప్రారంభించి 4.642 మిలియన్ చేపట్టి నట్లు తెలిపారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి శుక్రవారం సాయంత్రం వరకు 342.255 మిలియన్ యూనిట్లను రాబట్టగలిగామని తెలిపారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే రికార్డు స్థాయి లో ఉత్పత్తి కొనసాగించే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

ఉదయాన్నే క్యూలో పడిగాపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు యూరియా కోసం ఉదయాన్నే క్యూలో ఉండి పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని చోట్ల ఆందోళనలతో రోడ్డెక్కగా, మరికొన్ని ప్రాంతాల్లో తమ నిరసన వెలిబుచ్చారు.

గద్వాల/జడ్చర్ల/ఖిల్లాగణపురం/నవాబ్‌పేట/హన్వాడ/ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్నా... వానాకాలం ముగిస్తున్నా.. యూరియా కోసం తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికే జిల్లా టార్గెట్ కంటే ఎక్కువ యూరియా పంపిణీ జరిగిన ఇంకా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. శుక్రవారం గద్వాల వ్యసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన యూరియా పంపిణీకి పెద్ద ఎత్తున రైతులు ఉదయాన్నే క్యూలైన్‌లో నిలబడ్డారు. పోలీసుల సహకారంతో మొదట స్లిప్‌లు పంపిణీ చేసి ఆ తర్వాత యూరియా అందించారు. మొత్తం 450మంది రైతులు దాదాపు 1100 సంచుల యూరియ పంపిణీ చేసినట్లు పీఏసీఎస్ అధికారులు తెలిపారు.

● యూరియా బస్తాల కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. జడ్చర్లలో తెల్లవారుఝామున నుంచే ఏఏ కేంద్రాల వద్ద యూరియాను సరఫరా చేస్తారో తెలుసుకుని అక్కడ పడిగాపులు పడుతున్నారు. జడ్చర్ల పట్టణంలోని సిగ్నల్‌గడ్డ దారిలోని మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా సరఫరా చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు ఉదయం 5గంటల నుంచి గ్రోమోర్ కేంద్రం వద్ద క్యూలో నిలుచున్నారు. మొదటగా యూరియా లభించగా, వెనకబడిన రైతులకు దొరక్కపోవడంతో దీనంగా వెనుదిరిగారు.



గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో క్యూలో రైతులు



హన్వాడలో ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ

● ఖిల్లాగణపురం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి యూరియా కోసం రైతులు క్యూలైన్‌లలో నిలబడుతున్నారు. యూరియా కోసం వచ్చిన మహిళా రైతులు శుక్రవారం క్యూలైన్లలో నిలబడలేక కూర్చుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

● గత రెండు రోజులుగా యూరియా కోసం వివిధ గ్రామాలకు చెందిన రైతులు నవాబ్‌పేటలోనే ఉంటూ సింగిల్‌విండో కార్యాలయం చుట్టూ పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం ఉదయం యూరియా వస్తుందని రైతులు భారీగా మండల కేంద్రానికి చేరుకుని ఎర్రసత్యం చౌరస్తాలో ఆందోళనకు దిగి వాహనాలు నిలిపి రాస్తారోకోకు యత్నించారు. దీంతో ఎస్ఐ విక్రం ఘటన రైతులను వారించడంతో ఆందోళన విరమించారు.

● హన్వాడలో శుక్రవారం యూరియా టోకెన్ల కోసం అన్నదాతలు ఆందోళన చేశారు. ఉదయం నుంచి ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద యూనియా కోసం వచ్చిన రైతులు వేచిచూశారు. అయితే యూరియా ఈ రోజు రాదని అధికారులు చెప్పినా వినలేదు. సాయంత్రం రైతులు టోకెన్లు అయినా ఇవ్వాలని తండూర్ మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్ అక్కడి వచ్చి రైతులతో మాట్లాడి అక్కడి నుంచి పంపించారు.

● ఆత్మకూరులో యూరియా కోసం ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం ముందు రైతులు పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా శుక్రవారం వస్తుందేమోనని ఆయా గ్రామాల రైతులు కార్యాలయం ముందే క్యూకట్టారు. ఈ క్రమంలో ఆత్మకూరు మండలం వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ శుక్రవారం యూరియా రావడం లేదని, ఆరేపల్లి సింగిల్ విండో కార్యాలయంలో 300బస్తాలను పంపిణీ చేసినట్లు తెలిపారు.

సేవాభావాన్ని పెంపొందించుకోవాలి

» పీయూ ఎంఈడీ విభాగాధిపతి డాక్టర్ ఆంజనేయులు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని పీయూ ఎంఈడీ విభాగాధిపతి డాక్టర్ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పీయూ ఎంఈడీ విభాగం ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు మండలంలోని కోడూరు గ్రామాన్ని సందర్శించారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి గ్రామంలో అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను పరిశీలించారు. స్వచ్ఛతలో భాగంగా స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని విద్యార్థులతో కలిసి నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలించారు. గ్రామంలోని గుడి బడి కార్యక్రమంలో భాగంగా ఆంజనేయ స్వామి ఆలయం గురించి తెలుసుకున్నారు. గ్రామ కార్యదర్శి సునిత, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాంమోహన్, డాక్టర్ జయనాయక్, డాక్టర్ విజయ లక్ష్మి పాల్గొన్నారు.



మాజీ సర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న పీయూ ఎంఈడీ అధ్యాపకులు, విద్యార్థులు

పాఠశాల ఆటో బోల్తా

» స్వల్ప గాయాలతో బయటపడ్డ విద్యార్థులు

» ఆటోలో 20 మంది విద్యార్థులు

గట్టు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 20 మందితో వెళ్తున్న స్కూల్ ఆటో బోల్తా పడి విద్యార్థులకు గాయాలైన సంఘటన శుక్రవారం జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలో చోటు చేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామంలో నిర్వహిస్తున్న జ్ఞానసరస్వతి స్కూల్‌కు టాటాఏసీ ఆటో సల్కాపురం నుంచి నిత్యం పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తోంది. ఈ క్రమంలో శుక్రవారం ఆటో విద్యార్థులను తీసుకొని వెళ్తుండగా సల్కాపురం సమీపంలో అదుపు తప్పి పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. సంఘటన జరిగిన సమయంలో స్కూల్ ఆటోలో 20 మంది ఉన్నారు. విషయం తెలియడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన చెంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని తమ పిల్లలను అక్కున చేర్చుకున్నారు. సంఘటనలో రెండవ తరగతి చదువుతున్న శివాని అనే ఏడు సంవత్సరాల విద్యార్థినికి గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆటో పొలాల్లోకి దూసుకెళ్లిన సమయంలో ఆటో నెమ్మదిగా పోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై సల్కాపురం గ్రామానికి చెందిన బోయ మౌలాలి ఆటో డ్రైవర్ వీరేష్ అజాగ్రత్తగా నడపడం వల్ల బోల్తా పడిందని, ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేటీ మల్లేష్ తెలిపారు. జ్ఞాన సరస్వతి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ గద్వాల నియోజకవర్గ అభ్యర్థి ఎస్ రాజు శుక్రవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు ఫిర్యాదు చేశారు.



సల్కాపురం గ్రామం దగ్గర పొలాల్లో బోల్తా పడిన స్కూల్ ఆటో



తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు
● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్
భారత ఆశలన్నీ నీరజ్‌పైనే



స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం



నేటి భారత షెడ్యూల్
ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి
సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్దేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ చేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్



సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఘుర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు
బంగ్లాదేశ్ x శ్రీలంక
రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..



దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయీమ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).
ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయీమ్ అయూబ్ 2/8).

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..
● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొదాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి
● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషబ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట
● 10 ఏళ్ల వరకు గడువు పెంపు
● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు

● రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు
● రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి
● నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట
● రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ
● ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్ణీత గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు
● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్ఎల్ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్ఎల్ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్ఎల్ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్ఎల్ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్ల లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲

● ఐటీసీ ఆశీర్వాద్ మసాలా..నేచురల్ స్టార్ నానితో 'దమ్ము మీదే.. స్టార్ మీరే' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆంధ్ర, తెలంగాణ వాసుల అభిరుచులకు అనుగుణంగా దమ్దార్ ఫుడ్, సినిమా పేరుతో ఈ క్యాంపెయిన్‌ను మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించింది. ఇందులో భాగంగా వంటల పోటీలో గెలిచిన మహిళలతో నాని సినిమా థియేటర్ ప్రకటనలో కనిపించనున్నారు.

● హెల్త్‌కేర్ టెక్నాలజీ సంస్థ ఫుజిఫిల్మ్ ఇండియా.. నిజామాబాద్‌లో తన అడ్వాన్స్‌డ్ ఏఎంయుఎల్ఈటీ ఇన్నోవాలిటీ ఫుల్ ఫీల్డ్ డిజిటల్ మమ్మోగ్రఫీ (ఎఫ్ఎఫ్‌డీఎం) సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. విశ్వమ్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో ఈ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. బ్రెస్ట్ క్యాన్సర్ డయాగ్నోసిస్‌లో ఈ మమ్మోగ్రఫీ కీలకంగా ఉండనుంది.

● టాటా ఈవీ.. మార్కెట్లోకి సరికొత్త నెక్సాన్ ఈవీ విడుదల చేసింది. ఏడీఏఎస్ సేఫ్టీ టెక్‌తో దీన్ని తీసుకువచ్చింది. దీంతో పాటు కొన్ని కొత్త ఫీచర్లను పొందుపరిచింది. ఎంపవర్డ్ ప్లస్ ఏ45, ఏ45 డార్క్, ఏ 45 రెడ్ డార్క్ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ నెక్సాన్ ఈవీ ధరలు వరుసగా రూ.17.29 లక్షలు, రూ.17.49 లక్షలు, రూ.17.49 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగు పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేట్లలో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

మహిళల అభ్యున్నతికి కృషి

- శ్రీనివాస్, ఏపీఎం, చారకొండ



చారకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమాఖ్యలోని సంఘాల మహిళల అభ్యున్నతికి కృషి చేస్తామని ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. మహిళా సంఘాలు ఏర్పాటు చేసి ఆయా సంఘాలకు రుణాలు మంజూరుచేసి వారు స్వయం సమృద్ధి దిశగా పయనించడమే ప్రధాన లక్ష్యమని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

స్త్రీ నిధి ద్వారా ఎంత మందికి రుణాలు ఇప్పించారు ?

మండలంలో అన్ని గ్రామాల్లో 529 సంఘాల్లో 5,679 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఒక మండల మహిళా సమాఖ్య కొనసాగుతోంది. స్త్రీ నిధి ద్వారా ఇప్పటి వరకు 1,500 మందికి రూ. 8కోట్ల రుణాలు ఇప్పించాం. ఇప్పటి వరకు 98 శాతం రికవరీ చేశాం.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ఏఏ కార్యక్రమాలు చేపడుతున్నారు ?

మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు సూక్ష్మ ఆర్థిక ప్రణాళిక ప్రకారం రుణాలు ఇప్పిస్తాం. జీవనోపాధులను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మహిళా సంఘాల పని విధానం ఎలా ఉంది?

మండలంలోని మహిళా సంఘాలు అన్నీ బాగానే నడుస్తున్నాయి. కొన్ని చోట్ల నడవని సంఘాలకు అధ్యక్షులకు, సంఘం సభ్యులకు అవగాహన కల్పించి సంఘాన్ని నడిపించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు మహిళా సంఘాల సభ్యులతో చర్చిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ ఆసుపత్రిలో వసతులు కల్పించాలి : బీజేపీ

కొల్లాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస వసతులు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కేతూరి నారాయణ, కార్యదర్శి రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసేందుకు కావాల్సిన వైద్య పరికరాలు లేవని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ గ్రామ పంచాయతీలో ఒక సబ్ సెంటర్ ఏర్పాటు చేసి, అందులో ఒక డాక్టర్, ఒక నర్సుతో కూడిన సిబ్బందిని నియమించాలని ఆయన కోరారు. ఆసుపత్రిలో పూర్తి సిబ్బందితో కూడిన వసతులు కల్పించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం అచ్చంపేట మండల కమిటీని శుక్రవారం పట్టణంలోని విశ్రాంత భవనంలో విశ్రాంత ఉద్యోగులు ఎనుకున్నారు. సంఘం మండల అధ్యక్షునిగా సురేందర్‌రెడ్డి, కార్యదర్శిగా అశోక్ ప్రసాద్, ట్రెజరర్‌గా శంకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ నారాయణ, ఉపాధ్యక్షులుగా పుష్పమ్మ, విద్యాసాగర్, కమిటీ సభ్యులుగా రామస్వామి, మురళి, బాలస్వామి, ఖాజామైనోద్దీన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టు కుటుంబాలకు హెల్త్ క్యాంపు

- టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని వెల్దండ, కల్వకుర్తి, చారకొండ మండలాల జర్నలిస్టు కుటుంబాలకు ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కల్వకుర్తి పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలోని ఐక్యత ఫౌండేషన్ కార్యాలయంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే హెల్త్ క్యాంపులో జర్నలిస్టులతోపాటు కుటుంబ సభ్యులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భార్యతో గొడవ పడి భర్త అదృశ్యం

బల్మూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండలంలోని బిల్లకల్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మేడమోని రాములు (34), లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారు మూడు నెలల క్రితం గొర్రెలను మేపేందుకు బిల్లకల్ ప్రాంతానికి వచ్చి, అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నెల 8వ తేదీన రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. మరుసటి రోజు లక్ష్మి నిద్ర లేచే సరికి భర్త కనిపించలేదు. దీంతో విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో రాములు అన్న బాలనాగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అభిషేకాలు .. రక్తదాన శిబిరాలు

● ఘనంగా అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలు

- భారీ కేకులు కట్‌చేసిన నాయకులు, కార్యకర్తలు

- పదర మండలంలో ఇంటింటికీ కూరగాయలు, పండ్ల పంపిణీ



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్ సునీతాశ్రీనివాస్ రెడ్డి

అచ్చంపేట/ టౌన్/ మన్ననూర్/ అమ్రాబాద్/ చారకొండ/ కొల్లాపూర్, సెప్టెంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జన్మదినాన్ని అచ్చంపేట నియోజకవర్గం వ్యాప్తంగా నాయకులు, అధికారులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండలాలు, గ్రామాల్లో భారీ కేక్‌లు కట్ చేసి ఎమ్మెల్యే పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అచ్చంపేట వస్తున్న క్రమంలో కట్ట మైసమ్మ, హాజీపూర్ చౌరాస్తా, పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌లు కట్ చేశారు. ఆయనను గజమాలతో అభిమానులు సత్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, అంతటి మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రక్తదానం చేసిన నాయకులు, అభిమానులకు ఎమ్మెల్యే, సీబీఎం ట్రస్ట్ చైర్మన్ అనురాధ, 10వ వార్డు కౌన్సిలర్ సునీతాశ్రీని వాస్‌రెడ్డిలు అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదినం పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎన్ఆర్ ఎర్ర నర్సింహ పదరలో ఇంటింటికీ కూరగాయలు, పండ్లు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కేక్‌ను ఎమ్మెల్యేతో కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉమామహేశ్వరున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

ఉమామహేశ్వర స్వామిని ఎమ్మెల్యే వంశీకృష్ణ, అనురాధ దంపతులు దర్శించుకున్నారు. పూర్ణకుంభంతో ఆలయ ఈవో శ్రీనివాస్‌రావు, అర్చకులు వీరయ్యశాస్త్రీలు వారికి స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీరం మాధవరెడ్డి ఎమెల్యే దంపతులను శాలువాతో సత్కరించారు. ఉప్పునుంతల మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ, నర్సింహారెడ్డి ఆలయ అభివృద్ధి కోసం రూ 5లక్షల విరాళం ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆలయ ఈవో, చైర్మన్‌కు అందజేశారు. ● అమ్రాబాద్‌లోని వివేకానంద చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షు డు లక్ష్మణచారి ఆధ్వర్యంలో ఎమ్మె ల్యే వంశీకృష్ణ జన్మదినం సందర్భం గా ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే వంశీకృష్ణ కట్‌చేశారు. ●అమ్రాబాద్ మండలం మన్ననూరులో మాజీ ఎంపీటీసీలు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ మాజీ సభ్యుడు రహీం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ● చారకొండతో పాటు మండలంలోని తిమ్మాయిపల్లిలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాలరాంగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిని జైపాల్, కాంగ్రెస్ నాయకులు రంగినేని శ్రీపతిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ● కొల్లాపూర్‌లో ఇందిరాగాంధీ అభిమాన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు.



కూరగాయలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎన్ఆర్ ఎర్ర నర్సింహ



శ్రీశైలం ఎక్స్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే వంశీకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



నాగర్‌కర్నూల్‌లో సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినా కళాశాల స్థాయి నుంచే అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేసిన సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పర్వతాలు మాట్లాడుతూ 1975 ఎమర్జెన్సీ కాలంలో ఎస్ఎఫ్ఐ ఢిల్లీ యూనివర్సిటీ కమిటీ ప్రెసిడెంట్‌గా ఉన్న సీతారాం నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఇంటిని ముట్టడించి ఆమె పదవికి రాజీనామా చేయించిన గొప్ప ఉద్యమకారుడు అని కొనియాడారు. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ఆర్ఎస్ ఎస్ ఎజెండా హిందుత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ హిందు, ముస్లింల మధ్య అనైక్యతను కారణమవుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్, కె.గీత, ఆంజనేయులు, నాయకులు రామయ్య, శంకర్‌నాయక్, మధు, బాలరాజు, శ్రీదేవి, శివలీల, సుకన్య, వెంకటమ్మ పాల్గొన్నారు. కల్వకుర్తిలో జిల్లా సీనియర్ నాయకుడు చిలుక బాల్‌రెడ్డి, కొల్లాపూర్‌లో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి, అమ్రాబాద్ మండలాల్లోనూ పార్టీ నాయకులు ఏచూరి చిత్రపటాలకు పూలమాలలు వేసిన ఘన నివాళి అర్పించారు.

బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే



కళాశాల ఫ్రెషర్స్ డేలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి వెంకటరమణ

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.రాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి జి.వెంకటరమణ, ఎంఈవో భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. నోడల్ అధికారి మాట్లాడుతూ కళాశాల ఇంటర్ విద్యార్థులు గత ఏడాది కంటే ఈ సారి మెరుగైన ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తితో రాబోయే వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని ఆధ్యాపకులను కోరారు. అనంతరం కళాశాలలో ఇటీవలే నియామకమైన నూతన అధ్యాపకులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన మాజీ ఎంపీ



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును కలిసిన మాజీ ఎంపీ రాములు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన భరత్‌ప్రసాద్, మాజీ ఎంపీ రాములు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులుతో కలిసి శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును కలిసి శాలువాతో సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైనందున భరత్ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి

కందనూలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం పొందిన క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీకి తాకట్టు పెట్టిన ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నాగర్ కర్నూల్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరమన్నారు. కార్మిక శాఖ గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి బీమా పేరుతో రూ250కోట్లు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, తెలంగాణ భవన నిర్మాణ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్నపాగ శ్రీనివాసులు, వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి రవీందర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్, సురేష్, సింగోటం, నరసింహ పాల్గొన్నారు.

17న మెగా రక్తదాన శిబిరం

కందనూలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదానం శిబిరాన్ని విజయవంతం చేయాలని యువమోర్చా జిల్లా కార్యదర్శి దన్నోజు నరేష్‌చారి కోరారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ఏర్పాటు చేస్తున్న రక్తదాన శిబిరంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజావర్ధన్‌రెడ్డి, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పోల్దాసు రాము, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, తాడూరు మండల అధ్యక్షుడు సుదర్శన్, బిజినేపల్లి మాజీ మండల అధ్యక్షుడు భూషయ్య, సుధాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ తండ్రి మృతి

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ తండ్రి రతన్‌సింగ్ గుండెపోటుతో మృతి చెందాడు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్, రతన్‌సింగ్ మృతదేహంపై పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. మృదుస్వభావి, స్నేహశీలి రతన్‌సింగ్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పలువురు నాయకులు పరామర్శించారు.

మిత్రునికి ఆర్థిక సాయం



ఎండీ అనీఫ్‌ను పరామర్శిస్తున్న స్నేహితులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95లో పదవ తరగతి చదివిన ఎండీ అనీఫ్ అనే యువకుడు ప్రమాదవశాత్తున కింద పడి కాలు విరిగింది. వైద్య చికిత్స కోసం తోటి మిత్రులు కలిసి శుక్రవారం రూ.50వేల నగదును బాధితుడు ఎండి.అనీఫ్‌కు అందజేశారు. ఆర్థిక సాయం చేసిన వారిలో పూర్వ విద్యార్థులు మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహ, కొల్లె తిరుపతయ్య, డాక్టర్ నలేశ్వరం, దండు బాలమల్లయ్య, ప్రభాకర్, నాగ మల్లయ్య, కరీం, ఖాజా, దండు చంద్రయ్య, కరుణాకర్ పాల్గొన్నారు.

బాధితుడికి ఎంబీఆర్ ట్రస్ట్ చైర్మన్ చేయూత

అచ్చంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, కల్వకుర్తి పట్టణ సమీపంలో యెన్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుడిగే నగేష్ యాదవ్‌ను ఎంబీఆర్ ట్రస్ట్ చైర్మన్ మారం సురేష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. తక్షణ సహాయం కింద రూ.25వేలు అందించారు. అధైర్య పడొద్దని యువకుని తండ్రికి భరోసా కల్పించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తిమ్మాజిపేట : మండల పరిధిలోని అప్పాజీపల్లిలో మహమ్మద్ రమీజాబేగం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. శుక్రవారం అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం బాధితురాలి ఇంటికెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకుంటానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, ఎల్లారెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి, తిరుపతయ్య, రాజు,సుందరయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ జులూస్



మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో మాట్లాడుతున్న మత పెద్దలు

కందనూలు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. జామా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం జిల్లా కేంద్రంలోని జామా మస్జిద్ నుంచి భక్తిశ్రద్ధలతో పిల్లలు, యువకులు, పెద్దలు జెండాలను చేతబట్టి, ప్రవక్త ప్రవచనాలతో ర్యాలీగా ముందుకు సాగారు. పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను భక్తితో ఆలపిస్తూ నిర్వహించిన ర్యాలీ ఆకట్టు కుంది. అనంతరం వక్ఫ్ కాంప్లెక్స్ వద్ద జెండా ఆవిష్కరణ ప్రత్యేక ఫాతేహాలు, ప్రవక్త ప్రవచ నాలు ఖసీదే బుర్దా షరీఫ్, నాత్ ఏ పాక్ ప్రవచనాలతో కార్యక్రమం భక్తితో సాగింది. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాల బాధ్యులు, అధిక సంఖ్యలో యువకులు, చిన్నారులు పాల్గొన్నారు. మిలాద్ ఉన్ నబీ ర్యాలీ సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

యూరియాను సజావుగా పంపిణీ చేయాలి

- యూరియా నిల్వలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

తెలకపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన గ్రోమోర్ సెంటర్లలోని 560 బస్తాల యూరియాను సజావుగా రైతులకు పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్లలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి నర్మద, విస్తరణ అధికారి శ్రావ్యతో కలిసి ఆయన పరిశీలించారు. మన గ్రోమోర్ సెంటర్‌లో యూరియా నిల్వలను పరిశీలించారు. మండలంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రం, ఆగ్రో రైతుసేవ కేంద్రాలలో ఉన్న నిల్వల వివరాలను తెలుసుకున్నారు. రైతులకు నానో యూరియాను ఉపయోగించాలని సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

తెలకపల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిని డీఎంహెచ్‌వో రవికుమార్ శుక్రవారం సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ మధ్య కాలంలో ప్రైవేటు ఆసుపత్రులపై ఫిర్యాదులు అందడంతో తనిఖీలు నిర్వహించా రు. ఇదే క్రమంలో గురువారం ఫిర్యాదు చేసిన సంఘటనపై స్పందించి శుక్రవారం సదరు ఆసుపత్రిని సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో యాజమాన్యం లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బందికి జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయానికి హాస్పిటల్‌కు సంబంధించిన అనుమతి పత్రాలు సర్టిఫికెట్స్ తీసుకుని రావాలని ఆయన ఆదేశించారు. డీఎంహెచ్‌వో వెంట ఇతర అధికారులు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

- ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయం ఆవరణలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా 3వ మహాసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణలో ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆశావర్కర్స్‌కు రూ.1.50 లక్షల రూపాయలను గ్రాట్యుటీ చెల్లించడంతో పాటు 180 రోజుల ప్రసూతి సెలవులు అమలు చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, అధ్యక్షుడు ఆంజనేయులు, సహాయ కార్యదర్శి రామయ్య, శంకర్ నాయక్, శివవర్మ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, కళావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ రజిత, శ్రీదేవి, భాగ్యమ్మ, సరళ, వరలక్ష్మీ, సువర్ణ, కృష్ణవేణి, సుకన్య పాల్గొన్నారు.

పత్తి క్వింటాకు రూ.12 వేలు ఇవ్వాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులకు నాణ్యతతో సంబంధం లేకుండా క్వింటాలుకు మద్దతు ధర రూ.12 వేలు చెల్లించి ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని దేశిటిక్యాల శివారులో రైతు కొండన్న పొలంలో పత్తి పంటను రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటకు ఎర్ర తెగులు సోకి కాయలు మురిగిపోయి పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభు త్వం కనీస మద్దతు ధర రూ.12 వేలు చెల్లిం చాలని, కొనుగోలు చేసిన ఇరవై నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలరాజు, గుంపల్లి ఈశ్వరయ్య, షరీఫ్, గుంపల్లి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో డిపో ముందు ధర్నా

కొల్లాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సేవ్ ఆర్టీసీ పేరుతో కొల్లాపూర్ ఆర్టీసీ బస్ డిపో ముందు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో డ్రైవర్లు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లు విద్యుత్ బస్సుల విధానంలో మార్పు చేయాలని, ఆర్టీసీలో విద్యుత్ బస్సులు కొనేందుకు, నిర్వహించేందుకు, నడిపించేందుకు అవకాశం ఇచ్చి నిధులు ఇవ్వాలని ఆర్టీసీలోని కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఖర్చుకు ఆదాయానికి మధ్య వ్యత్యాసాన్ని ఆర్టీసీలకు ప్రభుత్వం చెల్లించాలని ఆర్టీసీ కార్మికుల అలవెన్స్‌లు అన్నింటినీ ఐదురెట్లు పెంచి అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల పెండింగ్ వేతన ఒప్పందాలు వెంటనే చేసి, ఏరియర్స్ చెల్లించాలని బస్సుల బాడీ బిల్డింగ్ యూనిట్స్, వర్క్ షాపుల తరలింపులు నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు అంబయ్య, వెంకటేశ్వర్లు, బాలస్వామి, సింగారం వెంకటయ్య , కార్మికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ యాత్ర దానంలో భాగస్వాములుకండి : డీఎం

కొల్లాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ యాత్ర దానం పేరిట అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమంలో ఎన్నారైలు, పలు స్వచ్ఛంద, కార్పొరేట్ సంస్థలతో పాటు ఇతరులు కూడా దాతృత్వంతో ముందుకు రావాలని కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమాశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వ్యక్తుల పుట్టిన రోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాలు తదితర ప్రత్యేక సందర్భాల ఆనందదాయక రోజుల్లో మనలో ఒకరిగా ఉన్న అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులు పుణ్యక్షేత్రాలకు, విజ్ఞాన విహార యాత్రలకు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లాలని కోరిక ఉన్నప్పటికి ఆర్థిక సామాజిక పరిస్థితుల వల్ల వెళ్లలేని పరిస్థితులు ఉన్న వారికి ఆయా ప్రాంతాలకు తీసుకువెళ్లుటకు తమ వంతుగా ఆర్టీసీకి డబ్బులను విరాళంగా అందజేసి బస్సు సదుపాయాన్ని కల్పించాలని కోరారు.

గ్రూప్-1 పరీక్షను మళ్లీ నిర్వహించాలి : బీఆర్ఎస్‌వీ

కొల్లాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 పరీక్షను తిరిగి నిర్వహించాలని, జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇవ్వాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకులు శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శేఖర్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకు గ్రూ ప్-1 పరీక్ష రద్దు చేసి మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆయన కోరారు. అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

కొల్లాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు 12-09-2025 నుంచి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్ 2025-26) మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ డిగ్రీ కళశాల, కొల్లాపూర్‌లో మిగిలిన సీట్లు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ ఉదయ్ కుమార్ వెల్లడించారు. స్పాట్ అడ్మిషన్లు 15-09-2025 నుంచి 16-09-2025 వరకు జరుగుతాయని, ప్రత్యేక స్పాట్ అడ్మిషన్ రౌండ్ 18, 19వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

12వ రోజుకు చేరిన దీక్షలు

కోడేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఏదుల రిజర్వాయర్‌లో భాగంగా తీగలపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ భూములకు నష్టపరిహారం చెల్లించాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో 12వ రోజుకు చేరాయి. విలేకరులతో భూ నిర్వాసితులు మాట్లాడుతూ తమకు ఉన్న కొద్దిపాటి భూమిని లాగేసుకుని నష్టపరిహారం చెల్లించకుండా రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇది ఇస్తామని, అది ఇస్తామని కల్లబొల్లి కథలు చెప్పి భూములు లాగేసుకొని మా బతుకులు ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మాకు నష్ట పరిహారం ఇవ్వకపోతే క్రిమి సంహారక మందు సేవించి చనిపోతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాములు, చంద్రశేఖర్, బొజ్జమ్మ, రైతులు పాల్గొన్నారు.